# వినాయకచవితి 'కాలమ్ దాటని కథల' పోటీలో ఎన్నికైన కథలు

"నాన్నా! నాన్నా! పిడుగు పడటం అంటే ఏమిటి?" ఆసక్తిగా అడిగాడు నాని. పిల్లలడిగే ఇలాంటి విజ్ఞాన దాయకమైన సందేహాలను వెంటనే తీర్చాలని అనిపించి

## పిడుగు - బుడుగు

చదువుతున్న పేపరు ఆపి కుర్రాడిని దగ్గరికి తీసుకొని చెప్పడం మొదలెట్టాడు వాళ్ళ నాన్న.

"మేఘాలు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతున్నప్పుడు ఆకాశం నుండి విద్యుత్తు ప్రసారంతో కూడిన పిడుగు పడే అవకాశ ముంది. పిడుగు తాకిడికి గురైన వ్యక్తి షాక్ తగిలి మాట కోల్పోవచ్చు లేక మూపు దెబ్బతినవచ్చు. దాని తీవ్రతను బట్టి ఆ వ్యక్తి మరణించడానికి కూడా అవకాశం వుంది. పిడుగు పడ్డ భవనం కుప్పలా కూలిపోవడం కూడా జరుగుతుంది. తెలిసిందా!"

శ్రద్ధగా విన్నాక "అయితే...మరే అమ్మ బంగారు గాజుల రిపేరు చేయించడానికని షాపులో ఇచ్చింది కదా! ఆ షాపు వాడు దివాలా తీసి ఎటో పారిపోయాడని నువ్వు చెప్పగానే పిడుగులాంటి ఆ వార్త నమ్మలేక పోతున్నానని అందిగా! అసలప్పుడు పిడుగు పడందే?" అమాయకంగా ప్రశ్నించాడు నాని.

"సర్లేరా! ఇప్పుడా విషయాలన్నీ గుర్తుచేసి బాధ పెట్టకు. స్కూలు టైమవుతోంది. నువ్వు త్వరగా రెడీ అవ్వు!" విసుగ్గా పంపేశాడు వాళ్ళ నాన్న. 'ఏవిటో! సగం



చెప్పి ఊరుకుంటారు ఈ పెద్దోళ్ళు!' గొణుక్కుంటూ బాత్‌రూంకేసి నడిచాడు.

"నాన్నా! నాన్నా!"

"మళ్ళీ ఏమొచ్చిందిరా?"

స్కూల్ డ్రస్ వేసుకుంటూ సెలవిచ్చాడు సుపుత్రుడు.

"మరేమో నిన్న నువ్వు సినిమాకని బయటికెళ్ళి నప్పుడు నీకో ఫోనొచ్చింది. ఎవరో మీ ఆఫీసులో పన్జేసే టైపిస్టు ఆంటీ అనుకుంటా! సినిమాకు తను రావడం లేదని నీతో చెప్పమంది. అమ్మ లేకుండా చూసి నీకీ విషయం చెబితే, ఊరి నుంచి వచ్చాక చాక్లెట్లు కొని పెడతానంది. కానీ నువ్వు తిరిగొచ్చేసరికి నేను పడుకుం టాగా! మరి నాకెలా కుదురుతుంది? అందుకే అమ్మనే ఆ విషయం నీతో చెప్పమని, చాక్లెట్లు మాత్రం నేను తీసుకుంటానని చెప్పి మరీ నిద్రపోయా! చెప్పిందా?"

'చంపాడు రాస్కెల్! అదా సంగతి! అందుకేనన్న మాట రాత్రి భార్యామణి అలకపాన్పు ఎక్కడం, ఎన్ని సార్లడిగినా ఇంత వరకు కాఫీ కూడా అందించకపోవడం. ఇంకా ఏం ప్రమాదం ముంచుకొస్తుందో దేవుడోయ్!' అనుకుంటూ-"ఇప్పుడు పడిందిరా నా మీద పిడుగు! వెళ్ళు వెధవా, బుద్ధిలేకపోతే సరి" నాన్న అరుపులకి అర్థం తెలియనిపసివాడు స్కూల్‌కి బయల్దేరాడు.

బంగారు గాజుల విషయంలో అమ్మ విన్న పిడుగు లాంటి వార్త, టెలిఫోను విషయం చెబితే నాన్న మీద పిడుగు పడిందని కేకలెయ్యడం అంతుపట్టలేదు వాడిగాడికి. ఈ రెండు సంఘటనలకి ప్రొద్దున్న నాన్న చెప్పిన ఆకాశంలో నుండి పిడుగు పడే పద్ధతికి ఏమీ సంబంధం లేనట్టుగా అనిపిస్తోంది ఆ లేతబుర్రకి.

క్లాస్‌లో టీచరు అటెండెన్స్ తీసుకొంటున్నా వాడికి పిడుగు మీదే ఆలోచన.

"పిల్లలూ! నిన్నటి హోమ్ వర్క్ చూపించండి ముందు" అన్న మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు.

"ఇవ్వాళ హోమ్ వర్క్ సరిగ్గా చేయని వాళ్ళని గోడ కుర్చీ వేయిస్తాను. ప్రతి రోజూ నేను పట్టించు కోవడం లేదని మీకు అలుసైపోయింది. అసలు హోం వర్క్ చేయని పిల్లలకి గోడ కుర్చీతోపాటు పది బెత్తం దెబ్బలు, వంద గుంజిళ్ళు అదనంగా శిక్ష పడుతుంది" గట్టిగా చెప్పేసింది టీచరు.

అదిరిపడ్డాడు నాని. నిన్నంతా నాన్న ఇంట్లో లేరేమో...ఆటల్లోపడి హోమ్ వర్క్ విషయం పూర్తిగా మరిచిపోయాడు. ఇప్పుడెలా?

టీచరు చెప్పిన శిక్ష...

బాబోయ్! అదే పిడుగు లాంటి మాట!

షాక్ తగలడం, చెమటలు పట్టడం, కుప్పలా కూలి పోవడం, 'ఓహ్! పిడుగు పడితే ఇలాగే వుంటుందేమో!' స్వానుభవం మీద తెలుసుకున్నాడు ఆ బుడుగు.

— రాకుమార్

---

"ఒరే! ఒరేయ్! అయ్యో! అయ్యో! ఆ... వాడివి ముట్టేసుకున్నావు గదరా నీ నోరు పడా! అసలే ఝాం పొద్దెక్కింది! ఇంకా మడిగట్టుకు తగలబడలేదు అను కుంటుంటే నీవీ ఘనకార్యం చేసావా! ఇలావచ్చి బట్టలు విప్పి తగలబెట్టు — నీళ్ళు పోస్తాను."

## వర్ణ(ర్గ) భేదము

సుందరమ్మగారి ధాటికి బిక్కచచ్చిపోయిన రంగడు పిల్లిలా బావి దగ్గరికి నడిచాడు. అంతకు ముందే జారుకున్నాడు రాందాసు.

"వాడు జాంకాయ కావాలంటే ఇచ్చాను. తాకితే ఏమవుతుందేమిటి?" బింకంగా అడిగిన కొడుకు చెవి మెలిపెట్టుతూనే—

"ఓరి అప్రాచ్యపు వెధవ! వాళ్ళని తాకడం పాపం కాదూ! ఏదన్నా ఇవ్వదలచుకుంటే ఎత్తిపడెయ్యాలి" అనునయంగా చెప్పింది తల్లి.

ఇది ఏభై ఏళ్ళనాటి ముచ్చట!

* * *

"ప్రమోద్! యూ స్టుపిడ్ బోయ్! కమ్హియర్!" గాండ్రించింది కల్పన.

గబగబ బ్యాట్, బాల్ తీసుకుని పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చాడు ప్రమోద్.

'యూ ఫూల్ — నీ కెన్నిసార్లు చెప్పాను, ఆ డర్టీ ఫెలోస్‌తో అలా వీధుల్లో ఆడొద్దని. ఇంకెవరు దొరకలా నీకు ఆడుకోండుకు! నా మాట అసలు లెక్కలేదు నీకు" అంటూ రెండు వేసింది కొడుకుని.

చూస్తూవున్న రాందాసు ఊరుకోలేకపోయాడు.

"పోనీ లేమ్మా! చిన్న పిల్లలు ఏదో ఆడుకుంటారు" మనవణ్ణి దగ్గరకు లాక్కుంటూ అన్నాడు.

"మీకు తెలియదులేండి! ఆ దరిద్రపు వెధవలు వీడి దగ్గర అన్నీ లాక్కొని పంపిస్తారు. కొనుక్కొని ఏడవ గూడదూ" రుస రుసలాడుతూ అంది కల్పన.

రాందాసుకు వాళ్ళు సుందరమ్మగారి అబ్బాయి రంగారావుగారి మనవలన్న విషయం తెలుసు.

వాళ్లెంతటి అభిమానస్తులో తెలుసు!

తమ అంతస్తుకు తగినవాళ్ళతో స్నేహమేమిటన్న కోడలి దుగ్గా తెలుసు. తెలిసే ఏమీ మాట్లాడలేక పోయాడు. గొప్ప ఆఫీసరైన కొడుకు భార్య ఆమె! గొప్ప

వి.ఛాయాదేవి

వారి ఆడపడుచు!

ఆనాడు వర్ణ భేదం!

ఈనాడు వర్గ భేదం

ఎవరన్నారు అంటరానితనం అంతరించిందని!

---

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కథ: ______________________

రచయిత/ రచయిత్రి: ______________________

పేజీ నంబరు: ______________________